స్మార్ట్ తిప్పలు

- రేషన్ కార్డు ఎక్కడ తీసుకోవాలో తెలియక కార్డుదారుల ఆందోళన
- ఇంటి వద్దనే కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని నాయకులు, అధికారుల ప్రకటన
- ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది విముఖత
- తమ స్మార్ట్ కార్డు ఏ డిపోలో ఉందో తెలియక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ
- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 17 వార్డుల్లోని 48 డిపోల్లో 33,856 కార్డులు
- నేటికి 20 శాతం కూడా పంపిణీ చేయని అధికారులు, డీలర్లు


స్మార్ట్ కార్డుల సమాచారం కోసం సచివాలయానికి వచ్చిన కార్డుదారులు

సీతంపేట : కూటమి ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన స్మార్ట్ కార్డుల పంపిణీలో స్పష్టత లేక రేషన్ కార్డుదారులకు అవస్థలు మొదలయ్యాయి. ఆగస్టు 24న ఏఎస్‌వో కార్యాలయాలకు చేరిన స్మార్ట్ కార్డులను సచివాలయాలకు పంపించారు. అదే నెల 27న ఎంపిక చేసిన సచివాలయాల్లో నియోజకవర్గ, వార్డు స్థాయిలో నాయకులు స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. కొంత మందికి కార్డులు అందజేసి, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి స్మార్ట్ కార్డులు అందజేస్తారని ప్రకటించారు. సచివాలయ సిబ్బందిని కార్డుల పంపిణీకి క్లస్టర్ల వారీగా మ్యాప్ చేశారు. రెండు రోజులపాటు సచివాలయాల్లోనే సిబ్బంది కార్డులు అందజేశారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల వద్ద క్యూ కట్టారు. అనంతరం ఇంటింటికీ కార్డుల పంపిణీకి సచివాలయ సిబ్బంది విముఖత వ్యక్తం చేయడంతో పంపిణీకి బ్రేక్ పడింది. ఈ నెల మొదటి రెండు మూడు రోజుల్లో పెన్షన్ల పంపిణీ ఉంటుందని, తామంతా కొత్తగా బదిలీపై గత నెలలో వచ్చినందున సచివాలయ పరిధిలో నివాసాలు, డోర్ నంబర్ల మ్యాపింగ్, క్లస్టర్లు తదితర విషయాలపై అవగాహన లేక పంపిణీ కష్టమవుతుందని తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చారు. రెండు రోజల పాటు సచివాలయాల్లోనే కొద్ది మందికి కార్డులు అందజేసిన తర్వాత... మిగతా కార్డులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. దీంతో స్మార్ట్ కార్డులను ఆయా డిపోలకు తరలించారు. అధికారుల నిర్ణయంతో ఇంటి వద్దకే వచ్చి స్మార్ట్ కార్డులు అందజేస్తామన్న నాయకుల మాటలు గాల్లో కలిసిపోయాయి.

పోర్టబిలిటీ కార్డుదారులకు తప్పని కష్టాలు

నగరంలోని అద్దె ఇళ్లలో ఉంటున్న వారు స్మార్ట్ కార్డుల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. చాలా మంది రేషన్ కార్డు ఒకచోట తీసుకుని, ఇప్పుడు రెండు మూడు సార్లు ఇళ్లు మారి వేరే ప్రాంతంలో రేషన్ తీసుకుంటున్నారు. తమ స్మార్ట్ కార్డు కోసం ఏ డిపోకు వెళ్లాలో తెలియక సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అలాగే ఇతర జిల్లాల నుంచి ఉద్యోగాలు, ఉపాధి కోసం వలస వచ్చిన వారు పోర్టబిలిటీ విధానంలో రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంది. దీంతో లబ్ధిదారులు తమ సొంత ఊరు లేదా వార్డులో కార్డు ఉన్నప్పటికీ, ప్రస్తుతం వేరే ఊరిలో ఉన్నా అక్కడి నుంచే రేషన్ పొందుతున్నారు. స్మార్ట్ కార్డు మాత్రం కార్డు జారీ చేసిన రేషన్ డిపోలో తీసుకోవాల్సి ఉంది. ఇతర జిల్లాల్లో, దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్మార్ట్ కార్డుల కోసం స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంది. ఉద్యోగాలు, కూలి పనుల నిమిత్తం నగరానికి వలసొచ్చిన వారు స్మార్ట్ కార్డు తీసుకోవడానికి సెలవు పెట్టి సొంత ప్రాంతాలకు వెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడింది కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ సేవా కేంద్రాల్లో, సచివాలయాల్లో కార్డు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని దూరప్రాంతాల వారు కోరుతున్నారు.



సీతంపేటలో స్మార్ట్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న మహిళలు

గంటల తరబడి నిరీక్షిస్తున్న కార్డుదారులు

స్మార్ట్ రేషన్ కార్డులు ఎక్కడ ఇస్తారో తెలియక లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్తుంటే... ఇక్కడ కాదు రేషన్ డిపోల్లో ఇస్తారని చెప్పడంతో వారంతా వెనుతిరుగుతున్నారు. ఒకటో తారీఖు నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుండడంతో కొత్త కార్డుల కోసం లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద ఎండనక, వాననక క్యూ కడుతున్నారు. గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అన్ని సేవలు అందించేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను తొలగించడంతో మహిళలు, వృద్ధులు, వికలాంగులకు కష్టాలు తప్పలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డుల్లో ఉన్న 48 రేషన్ డిపోల పరిధిలో సుమారు 34 వేల రేషన్ కార్డులుండగా, ఇప్పటి వరకు కేవలం 20 శాతం మాత్రమే కార్డులు పంపిణీ చేసినట్టు తెలుస్తోంది. సోమవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభం కానుండటంతో, కొత్త కార్డు చేతికి అందక రేషన్ ఎలా తీసుకోవాలని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సెప్టెంబర్ నెల రేషన్ తీసుకోవడానికి పాత రేషన్ కార్డులు పనిచెయ్యవని, సెప్టెంబరు 1 నుంచి 15 రకు రేషన్ డిపోల్లో స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందని ప్రచారం జరుగుతోంది. పాత రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ డిపోకు తీసుకెళ్తే... ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెబితే కొత్త కార్డు ఇస్తారని... లేదా ఈకేవైసీ చేసి తంబ్ వేయించుకుని కార్డు ఇస్తారని అంటున్నారు.


అక్కయ్యపాలెంలో స్మార్ట్ కార్డుల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

రెండు రోజులు తిరిగా..



కొత్త రేషన్ కార్డు కోసం శంకువానిపాలెంలోని రేషన్ డిపోకు వెళ్తే అక్కడికి కార్డు రాలేదన్నారు. పాత రేషన్ కార్డు పట్టుకుని సచివాలయానికి వెళ్తే 7వ నంబరు డిపోకు కొత్త కార్డు వచ్చిందని చెప్పారు. వయస్సు పైబడినా రెండు రోజులు తిరిగాను. చివరకి కార్డు చేతికి వచ్చింది.

– ఎం.రామిరెడ్డి, అక్కయ్యపాలెం

సొంత ఊరికి వెళ్లాలంట



మాది విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం, తామరాపల్లి గ్రామం. ఉపాధి కోసం 12 ఏళ్ల కిందట విశాఖ వచ్చాను. ఇక్కడ సెక్యూరిటీగా పనిచేస్తున్నా. చాలా కాలంగా అక్కయ్యపాలెంలో రేషన్ సరకులు తీసుకుంటున్నా. ఇప్పుడు స్మార్ట్ కార్డు మా సొంత ఊరెళ్లి తీసుకోవాలంటున్నారు. రెండు రోజులు సెలవు పెడితే గానీ వెళ్లి రావడం కుదరదు.

– శీల చిన్నారావు, అక్కయ్యపాలెం

క్లుప్తంగా

పద్మాసన గణపతి అలంకారంలో..


పద్మాసన గణపతి అలంకారంలో విజయగణపతి

సీతంపేట: స్థానిక శంకరమఠం రోడ్ మధురానగర్‌లో కొలువైన విజయ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆరో రోజు సోమవారం పద్మాసన గణపతి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పద్మాసనంలో కూర్చున్న గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించి అభిషేకం, అర్చనలు గావించారు.

ఆదిత్య గణపతిగా దుర్గాగణపతి


సీతంపేటలో శివబాల గణపతి అలంకరణలో దుర్గాగణపతి

సీతంపేట: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సీతంపేట కూడలిలో కొలువైన దుర్గా గణపతి ఆలయంలో సోమవారం స్వామివారు శివబాల గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో మహా గణపతి హోమం, మహాభిషేకం, సహస్రనామార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. మంగళవారం స్వామివారు 'స్కంధ గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో రమాబాయి తెలిపారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

రైతుబజార్‌లో అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈవో కొండబాబు

సీతంపేట : స్థానిక నరసింహనగర్ రైతుబజార్‌లో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. బజారు ఈవో పి.కొండబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పర్యవేక్షణలో రైతులు, డ్వాక్రా వ్యాపారులు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. రైతులు, వ్యాపారులు, హోల్‌సేల్ వర్తకులు, తోపుడు బళ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, పరిసర ప్రాంత భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోకు సోమవారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీనారాయణపురం – 2లో అంగన్‌వాడీ కేంద్రం, శివశంకర్ రజకుల కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నరసింహనగర్‌లో డ్రైనేజీలు, వాసుదేవనగర్‌లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోన్ – 5 కమిషనర్ బి.రాము, ఈఈ పద్మావతి, ఏఈ ఉమామహేశ్వరావు, డీఈ భరణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ట్రాన్స్‌లేషనల్ మెడిసన్ ఇన్ క్యాన్సర్ (టీఎంసీ – 2025) అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ అక్టోబర్ 27, 28న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య పి.రాధిక, ఆచార్య రాఘవరావు, డీన్ కె.శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన


పలు సంస్థల ప్రతినిధులు పంపిణీ చేసిన క్లాత్ బ్యాగులతో విద్యార్థినులు

తాటిచెట్లపాలెం: పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్ కమ్యూనిటీ ట్రైనర్ ఐ. కృష్ణకుమారి పేర్కొన్నారు. రైల్వే న్యూ కాలనీలోని కమలా నెహ్రూ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. శాంతికుమారి మాట్లాడుతూ, విద్యార్థులంతా పర్యావరణానికి అనుకూలంగా జీవించాలని సూచించారు. ఇంటితో పాటు మన విద్యాసంస్థను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా విద్యార్థినులకు క్లాత్ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. భారతి, డి. సత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

సీతంపేట: సరస్వతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేస్తున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మంపడం వద్ద ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులందరూ పాల్గొని ప్రసాదం స్వీకరించగలరని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీల ఆందోళన

డీఎంహెచ్‌వో హామీతో విరమణ


నిరసన చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

బీచ్‌రోడ్డు: ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రమోషన్లు కల్పించాలని, రీ–డిప్లాయ్‌మెంట్ రద్దు చేయాలని, జీవో ప్రకారం పనివేళలు, సెలవులు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీలు పలుమార్లు డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. గత 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేసినప్పుడు.. వారం రోజుల్లో ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆందోళనకు స్పందించిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వారిని చర్చలకు ఆహ్వానించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఒకేషనల్ ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ల జెన్యూనిటీ వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తి చేసి, మరో రెండు రోజుల్లో ప్రమోషన్లు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హామీ ఇచ్చారు. అలాగే సచివాలయం హెల్త్ సెక్రటరీలకు రీ–డిప్లాయ్‌మెంట్ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిపారు. పనివేళలు, సెలవులు తప్పకుండా చట్ట ప్రకారం అమలు చేస్తామన్నారు. ఆయన హామీ మేరకు హెల్త్ సెక్రటరీలు ఆందోళన విరమించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవకి, రత్నం, విశాఖ జిల్లా అధ్యక్షురాలు సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలపై వినతి

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత సోమవారం పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందించారు. వార్డులో న్యూశ్రీనివాసనగర్, ఇందిరానగర్ – 3లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు అందుబాటులో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలు దృష్ట్యా కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్లు నిర్మించాలని కోరారు.

టీషర్టులు పంపిణీ


టీషర్టులు పంపిణీ చేస్తున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం : జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ టీషర్టులను సోమవారం పంపిణీ చేశారు. మాధవధార ఉడా కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయం సమీపంలో నిత్యం పారిశుద్ధ్య పనులు చేసే వారికి టీషర్టులు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాగణపతి లడ్డూ వేలం


దుర్గా గణపతి లడ్డూను వేలంలో దక్కించుకున్న సతీష్‌కుమార్

సీతంపేట: స్థానిక సీతమ్మపేటలోని దుర్గాగణపతి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం 99 కిలోల భారీ లడ్డూను వేలం వేశారు. ఈ వేలంలో పలువురు పోటీ పడగా, చివరకు స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ కుమార్ ఆర్య రూ.1,11,006లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులపై అక్రమ కేసులు అన్యాయం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ఆరోపించారు. కొందరు అధికారులను సస్పెండ్ చేస్తూ, మరికొందరికి పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సుమారు 190 మందికి పైగా పోలీసు ఉన్నతాధికారులను పోస్టింగ్ లేకుండా ఖాళీగా ఉంచారని, 16 మంది ఐపీఎస్ అధికారులను డీజీపీ కార్యాలయానికే పరిమితం చేశారని విమర్శించారు. దీని వల్ల కూటమి ప్రభుత్వానికి పోలీసు వ్యవస్థపై గౌరవం లేదని స్పష్టమవుతోం దన్నారు. దళిత క్రైస్తవ అధికారి సంజయ్‌ను ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా, గత ప్రభుత్వంలో జరిగిన అగ్నిమాపక పరికరాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అరెస్టు చేయడం అన్యాయమని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఈ కేసులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బంధువైన వెంకటరమణ చౌదరికి అడిషనల్ డీజీగా పదోన్నతి కల్పించడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అధికారుల సస్పెన్షన్, అరెస్టుల వల్ల రాష్ట్రంలో భయానక వాతావరణం ఏర్పడిందని, ఇది శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుందని జాన్‌వెస్లీ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఈ కక్షపూరిత చర్యలు మంచివి కాదని ఆయన అన్నారు.

కుంగిన రహదారి


సీతంపేట గొల్లవీధిలో కుంగిపోయిన రహదారి

సీతంపేట: జీవీఎంసీ పరిధిలోని 25వ వార్డు, సీతంపేట పాత పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గొల్లవీధి, డోర్ నంబరు 50–78–10/8 వద్ద రోడ్డు కుంగిపోయి, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనివల్ల రాత్రివేళల్లో.. వర్షం పడినప్పుడు గుంతలు కనపడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, ప్రయాణికులు ఈ రోడ్డుపై నడవాలంటే భయపడుతున్నారని వారు తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సంతృప్తికరంగా సేవలు అందించా..


ధనుంజయరావు సత్కరిస్తున్న ఏయూ వీసీ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు సేవలందించడం ఎంతో గర్వకారణమని, ఈ అవకాశం తనకు కల్పించిన వీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు అన్నారు. రిజిస్ట్రార్‌గా రిలీవ్ అవుతున్న ఆయనకు అకడమిక్ సెనెట్ మందిరంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ధనంజయరావు మాట్లాడుతూ ఏడాది కాలం రిజిస్ట్రార్ సంతృప్తికరమైన సేవలు అందించానని చెప్పారు. ఈ సమయంలో ఎంతో నేర్చుకున్నానని, ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యతగా రిజిస్ట్రార్ పదవి నిలుస్తుందని చెప్పారు. ఏయూ వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ రిజిస్ట్రార్‌గా కొనసాగాలని ధనుంజయరావును తాను కోరానని... అయినా రిలీవ్ కావాలని భావించడంతో తప్పనిసరి పరిస్థితులలో వీడ్కోలు పలకాల్సి వస్తోందన్నారు. మంచి పరిపాలనదక్షుడిగా ధనుంజయరావు నిలుస్తారని కొనియాడాను. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వెలకట్టలేని సేవలను ధనుంజయరావు అందించాలని కొనియాడారు. ధనుంజయరావును వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, డి.నగరాజాకుమారి, ఆర్.పద్మశ్రీ. ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం విద్యకు దూరం కాకుండా చూడాలి

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యకు వెళ్లే క్రమంలో బడి మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఎన్‌సీటీఈ–ఆర్‌సీఐ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యురాలు, ఆచార్యురాలు డాక్టర్ టి.జి.అమృతవల్లి పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్ఈ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమృతవల్లి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులతో కలిసి చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు వారి అభ్యాసన స్థాయిని నిరంతరం గమనించాలని కోరారు. చదవడం, రాయడం, ప్రాథమిక గణిత అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండేలా చూడాలని వివరించారు. ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ చిన్నారులందరికీ సమాన అవకాశాలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్య విభాగం ఆర్జేడీ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం జాతీయ విద్యా విధానం రూపొందించబడిందని, మండలానికి ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తే వారి అవసరాలకు అనుగుణంగా విద్య అందించవచ్చని తెలిపారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దివ్యాంగులకు బోధించేటప్పుడు ఎదురైన సమస్యలను తెలియజేస్తే, వాటిని ఆర్‌సీఐ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తాటిచెట్లపాలెం: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.72 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివి.. ద్వారకానగర్‌లోని సుబ్బయ్య హోటల్ పై అంతస్తులో సోమవారం కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. వెంటనే వారు దాడి చేసి, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సీఐ డి.వి.రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మిస్ విశాఖ' పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: 'మిస్ విశాఖ 2025'పోటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకుడు అజయ్ అగర్వాల్ తెలిపారు. ఇప్పటికే వందకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ఇంకా ఎక్కువ దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో ఆడిషన్స్ నిర్వహిస్తామని, నవంబర్‌లో 'మిస్ విశాఖ 2025'గ్రాండ్ ఫినాలే జరుగుతుందని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు www.instagram.com/missvizag2025/ పేజ్‌లో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. కాగా.. నగరానికి చెందిన డాక్టర్ సృజన దేవి త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న 'మిస్ ఇండియా' పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆమెను 'ఫరెవర్ మిస్ ఇండియా'కిరీటంతో సత్కరించామని, 'మిస్ విశాఖ'గా ఎంపిక కాలేదని స్పష్టం చేశారు.